## చర్చిగల్లీలో త్వరలో డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మిస్తాం

**వెంగళరావునగర్:** చర్చి గల్లీలో త్వరలోనే నూతనంగా డ్రైనేజీ పైప్‌లైన్‌ను నిర్మించనున్నట్లు వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య విజయ్ తెలిపారు. చర్చిగల్లీలో కొంతకాలంగా డ్రైనేజీ సమస్యలతో ప్రజలు సతమతం అవుతున్నారు. ఈ సమస్యను స్థానిక నాయకురాలు జింకా ఆలీస్ గురువారం కార్పొరేటర్, మాజీ ఎమ్మెల్యే విష్ణు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కార్పొరేటర్ దేదీప్య జలమండలి అధికారులతో కలిసి ఆ ప్రాంతాన్ని సందర్శించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ... ప్రజా సమస్యలను పరిష్కరించడంలో వెనుకంజ వేసే ప్రశ్నేలేదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు విజయ్‌కుమార్, జింకా ఆలీస్, సుశీల్‌కుమార్, జలమండలి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సన్మానం




**ఇన్‌స్పెక్టర్ పురేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న శాంతిసంఘం ప్రతినిధులు**

**శ్రీనగర్‌కాలనీ:** సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ పురేందర్‌రెడ్డిని గురువారం సనత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఎర్రగడ్డ శాంతి సంఘం అధ్యక్షుడు గంట మల్లేష్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సంఘం సలహాదారు కె.బాల్‌రెడ్డి, చైర్మన్ నారామణస్వామి, వైస్ చైర్మన్ డి.సంజీవ, ఎం.డి. అజహర్, మహేందర్, రవీందర్, ఖలీల్, ధరాసింగ్, రఘు, అహ్మద్, గంట శ్రీనివాస్, బిజ్మోహన్, దయానంద్, వంశీకుమార్ పాల్గొన్నారు.

## కేన్సర్ ఆస్పత్రిలో అందుబాటులోకి 'కార్ టీ సెల్ థెరపీ'

**బంజారాహిల్స్:** బంజారాహిల్స్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ తెలుగు రాష్ట్రాల్లో మొదటిసారిగా కార్ టీ సెల్ థెరపీని అందుబాటులోకి తీసుకు వచ్చారు. దీంతో పాటు స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్వైవర్స్ సపోర్ట్ గ్రూప్‌ను కూడా ప్రారంభించారు. వీటిని గురువారం సంస్థ చైర్మన్ నందమూరి బాలకృష్ణ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలుగు రాష్ట్రాల్లో కార్ టీ సెల్ థెరపీ అందించే మొదటి కేంద్రంగా బసవతారకం హాస్పటల్ నిలుస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. గత ఏడాది డిసెంబర్ 27న మొట్టమొదటి కార్ టీ సెల్ థెరపీని రెసిస్టెంట్ లింఫోమాతో బాధపడుతున్న రోగికి విజయవంతంగా అందించడం ఎంతో గర్వకారణంగా నిలిచిందన్నారు. భవిష్యత్తులో అవసరమైన, అర్హులైన రోగులకు ఈ థెరపీతో పాటు స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్వైవర్స్ సపోర్ట్ గ్రూప్ సేవలను అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీఈఓ కూరపాటి కృష్ణయ్య, మెడికల్ అంకాలజీ విభాగం హెచ్ఓడీ డాక్టర్ సెంథిల్ రాజప్ప, మెడికల్ డైరెక్టర్ టీఎస్‌రావు, అసోసియేట్ డైరెక్టర్ కల్పనా రఘునాథ్, ట్రస్ట్ బోర్డు సభ్యులు జేఎస్ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వడ్డె ఓబన్న పోరాటం స్ఫూర్తిదాయకం: బీజేపీ



**వడ్డె ఓబన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం**

**బంజారాహిల్స్:** స్వాతంత్ర్య ఉద్యమంలో వడ్డే ఓబన్న చేసిన పోరాటం చిరస్మరణీయమని బీజేపీ నేతలు కొనియాడారు. జూబ్లీహిల్స్ డివిజన్‌లోని మహనీయుల విగ్రహాల వద్ద గురువారం వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ ఖైరతాబాద్ కన్వీనర్ గడ్డం వెంకట్‌స్వామి హాజరై వడ్డే ఓబన్న చేసిన సేవలను కీర్తించారు. బీజేపీ నాయకులు శ్రీనివాస్, శంకర్, దండుగుల శేఖర్, గణేష్‌యాదవ్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

**ఎస్పీఆర్ హిల్స్‌లో...**

**రహమత్‌నగర్:** వడ్డె ఓబన్న స్వాతంత్ర్య పోరాటంలో చూపిన తెగువ చరిత్రలో నిలిచిపోతుందని కార్పొరేటర్ సి.ఎస్.రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి భవానీశంకర్ కొనియాడారు. ఓబన్న జయంతి సందర్భంగా గురువారం ఎస్పీఆర్ హిల్స్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. వడ్డెర ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వేముల యాదయ్య, నాయకులు గొలుసుల ఎల్లయ్య, ముద్దంగుల శేఖర్, మేఘన పద్మ, కాంగ్రెస్ నేతలు గ్యార నాగరాజు, జె.పి.జ్ఞానేశ్వర్, అందాళు, కేశవులు, లక్ష్మణ్, ఎక్బాల్, మన్సూర్, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## అన్నపూర్ణాదేవికి ప్రత్యేక పూజలు

**వెంగళరావునగర్:** ప్రజలు కరువు కాటకాల బారిన పడకుండా సుఖ శాంతులతో ఉండాలని కోరుతూ అన్నపూర్ణాదేవికి ప్రత్యేక పూజలు చేశామని రహమత్‌నగర్ వర్తక సంఘం నాయకులు తెలిపారు. రహమత్‌నగర్ చౌరస్తాలో గురువారం వర్తక సంఘం ఆధ్వర్యంలో శ్రీఅన్నపూర్ణాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భాగంగా స్థానికంగా ఉన్న పేదలకు అన్నదానం చేశారు. ఒక్కపూటైనా ప్రజలు కడుపునిండా భోజనం తినే విధంగా అమ్మవారి కరుణా కటాక్షాలు ఉండాలని పూజలు చేపట్టామన్నారు. వర్తక సంఘం నేతలు తాడికొండ కృష్ణమూర్తిగుప్తా, ఎం.శ్యాంరావు ముదిరాజ్, జి.నటరాజ్ యాదవ్, పి.వి.బ్రహ్మానందం, కొవ్వూరి ప్రభు, ఆంజనేయులు యాదవ్, బుద్ధ నాగార్జునగుప్తా తదితరులు పాల్గొన్నారు.

## 1969 నాటి ఉద్యమకారులను రాష్ట్ర సాధకులుగా గుర్తించాలి

**బంజారాహిల్స్:** 1969 నాటి తెలంగాణ ఉద్యమకారులను రాష్ట్ర సాధకులుగా గుర్తించాలని 1969 తెలంగాణ ఉద్యమకారుల సమితి అధ్యక్షుడు, మాజీ మంత్రి మేచినేని కిషన్‌రావు డిమాండ్ చేశారు. ఇందుకోసం చట్టబద్ధమైన కమిటీని వేయాల్సిన అవసరం ఉందని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం దాదాపు 250 గజాల ఇంటి స్థలాన్ని కేటాయిస్తామని హామీ ఇచ్చిందని, అందుకు సంబంధించిన నియమ నిబంధనలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఉద్యమకారులందరికీ ఆరోగ్య భద్రత కల్పించాలని కోరారు. ఉద్యమకారుల చరిత్రను భావితరాలకు తెలిసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వంద ఎకరాల స్థలాన్ని కేటాయించి స్మృతివనాన్ని ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ దిశగా అడుగులు వేయాలని, అధికారిక కమిటీని వేసి అందులో ఉద్యమకారులకు అవకాశం కల్పించి న్యాయం చేసేందుకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఉద్యమ సమితి సెక్రటరీ జనరల్ దుశర్ల సుదర్శన్‌రావు, నేతలు ప్రొఫెసర్ ఉపేందర్‌రెడ్డి, మంకాల రాజిరెడ్డి, వనం చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# ముందే వచ్చిన సంక్రాంతి!

- కనువిందు చేసిన రంగవల్లులు
- పలు ప్రాంతాల్లో ముగ్గుల పోటీలు
- అందంగా ముగ్గులు వేసిన మహిళలకు బహుమతుల ప్రదానం
- పాఠశాలల్లో అంబరాన్నంటిన సంబురాలు
- హరిదాసుల వేషధారణల్లో చిన్నారులు
- సాంస్కృతిక కార్యక్రమాలతో సత్తాచాటిన చిన్నారులు



**గాయత్రీహిల్స్‌లో ముగ్గులను పరిశీలిస్తున్న జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్**





**బంజారాహిల్స్:** జూబ్లీహిల్స్ డివిజన్ జూబ్లీహిల్స్ రోడ్ నెం. 10లోని గాయత్రీహిల్స్‌లో గురువారం నిర్వహించిన సంక్రాంతి వేడుకల్లో భాగంగా కాలనీ అసోసియేషన్ నిర్వహించిన రంగవల్లుల పోటీల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విభిన్న రకాల రంగవల్లులను గీసి ఆకట్టుకున్నారు. కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ ఈ ముగ్గులను తిలకించి మహిళలను అభినందించారు. తొలి బహుమతిని శ్రీలతకు, ద్వితీయ బహుమతిని సౌమ్యకు, తృతీయ బహుమతిని వాణికి అందజేశారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు కొమ్మినేని రాఘవులు, లీలా రమేష్, వెంకటేష్ యాదవ్, శివ కొమ్మినేని, భరత్ భూషణ్, వాణి, రాజు తదితరులు పాల్గొన్నారు.





### సంక్రాంతి సంబురం.. చిన్నారుల సంప్రదాయ నృత్య సంభ్రమం





**భారతీయ విద్యాభవన్స్ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో చిన్నారులు**

**బంజారాహిల్స్:** భారతీయ విద్యాభవన్స్ ఆత్మకూరి రామారావు స్కూల్ చిన్నారులు సంక్రాంతి వేడుకలను గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. చిట్టిపొట్టి చిన్నారులు సంప్రదాయ దుస్తుల్లో విచ్చేసి గ్రామీణ సంస్కృతికి నిలువుటద్దంగా నిలిచే సంక్రాంతి పండుగను జరిపి ముచ్చటగొల్పారు. రైతులు, హరిదాసు, డూడూ బసవన్నల వేషధారణలతో ఆకట్టుకున్నారు. పాఠశాల ఉపాధ్యాయులు రంగురంగుల గాలిపటాలు, ముగ్గులతో పాఠశాల ప్రాంగణాన్ని అందంగా తీర్చిదిద్ది చిన్నారులకు సంక్రాంతి పండుగ విశిష్టతను తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ముఖ్యంగా సంక్రాంతి పాటలకు చేసిన నృత్యాలను చూసి ఆహుతులు తన్మయత్వంలో మునిగిపోయారు. వేడుకల్లో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలతానాయర్ హాజరై చిన్నారుల డ్యాన్స్‌లను తిలకించి అభినందించారు.

### భారతీయ విద్యా భవన్ పబ్లిక్ స్కూల్ విద్యాశ్రమంలో...



**భారతీయ విద్యా భవన్ పబ్లిక్ స్కూల్ విద్యాశ్రమంలో...**

**బంజారాహిల్స్:** జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యా భవన్ పబ్లిక్ స్కూల్ విద్యాశ్రమంలో రంగవల్లుల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. సంక్రాంతి పండుగకు మరింత వన్నె తీసుకువచ్చేలా పాఠశాలకు చెందిన 8 నుంచి 10వ తరగతి విద్యార్థులు రంగురంగుల ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు. సంప్రదాయం ఉట్టిపడేలా వేసిన సందేశాత్మక రంగవల్లులు కట్టిపడేశాయి. మన సంస్కృతి సంప్రదాయాలను నేటి తరానికి తెలియజేసి వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు తెలిపారు. ముగ్గులను చూస్తే చిన్నారుల సృజనకు అద్దంపట్టేలా ఉన్నాయన్నారు.

### గ్లోబల్ గ్రామర్ స్కూల్‌లో...



**బంజారాహిల్స్:** బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎన్బీటీ నగర్‌లో ఉన్న గ్లోబల్ గ్రామర్ స్కూల్‌లో గురువారం సంక్రాంతి పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రంగవల్లుల పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విభిన్నరకాల రంగవల్లులు తీర్చిదిద్ది ఆకట్టుకున్నారు. అనంతరం పండుగ ప్రాశస్త్యాన్ని, సంప్రదాయాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ కట్టా సునీల్, ప్రిన్సిపాల్ కట్టా శిరీష పాల్గొన్నారు.

### రెడ్ రోజ్ స్కూల్‌లో...



**రహమత్‌నగర్:** ఎస్పీఆర్ హిల్స్‌లోని రెడ్ రోజ్ హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు వైభవంగా జరిగాయి. వాతావరణ కాలుష్యం, సౌర కుటుంబం, జాతీయ స్థాయి నాయకుల చిత్రాలను విద్యార్థినులు ముగ్గుల రూపంలో వేసి ప్రశంసలు అందుకున్నారు. కరస్పాండెంట్ నీల రమేశ్ కుమార్‌గౌడ్ ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులను అందజేశారు. ఇన్‌చార్జ్ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

### శ్రీనిధి స్వీట్ ఏంజిల్స్‌లో...



**సంక్రాంతి వేడుకల్లో శ్రీనిధి స్కూల్ చిన్నారులు**

**వెంగళరావునగర్:** మధురానగర్‌లోని శ్రీనిధి స్కూల్ (స్వీట్ ఏంజిల్స్)లో గురువారం సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్కూల్‌లో భోగిమంటలు, బొమ్మరిల్లు, గంగిరెద్దుల ఆటలు, చిన్నారులకు భోగి పండ్లు పోయడం, హరిదాసుల కోలాటం, గొబ్బెమ్మలతో ముగ్గులు వేయడం తదితర కార్యక్రమాలు ఎంతో ఉత్సాహంగా జరిగాయి. అనంతనం చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. స్కూల్ డైరెక్టర్ గీతా లక్ష్మణ్, డైరెక్టర్ కృష్ణవేణి సుకుమార్, ప్రిన్సిపాల్ గీత, వైస్ ప్రిన్సిపాల్స్ విమల, రాజేశ్వరి, కో ఆర్డినేటర్ సాయిరాం, టీచర్లు శ్రీలక్ష్మి, స్రవంతి, అమీనా, ప్రీతి, వర్షసింగ్ పాల్గొన్నారు.

## భావి తరాలకు మార్గదర్శకుడు కాకర్ల



**బ్రోచర్‌ను విడుదల చేస్తున్న నిమ్స్ డైరెక్టర్ బీరప్ప**

**లక్డీకాపూల్ :** నిజామ్ వైద్య విజ్ఞాన సంస్థ మాజీ సంచాలకులు ప్రొఫెసర్ కాకర్ల సుబ్బారావు భవిష్యత్తు తరాలకు మార్గదర్శకుడని డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లే క్రమంలో నిరంతర విద్యా కార్యక్రమాలతో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. మార్చి 10న ప్రొఫెసర్ కాకర్ల జాతీయ స్థాయి ఉత్తమ పరిశోధనా పత్రం పోటీ-2024ను నిర్వహించనున్నట్టు తెలిపారు. గురువారం సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్ తెలంగాణ, నిమ్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీరప్ప మాట్లాడుతూ.. కాకర్ల సుబ్బారావు ఆశయ సాధనకు కృషి చేస్తున్న సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్‌ను ప్రశంసించారు. కార్యక్రమంలో నిమ్స్ రేడియాలజీ విభాగం భాగస్వామ్యం అవుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. నిరంతర విద్య కార్యక్రమాన్ని రేడియోగ్రఫీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డైరెక్టర్ కోరారు. కార్యక్రమంలో రేడియాలజీ హెడ్ డా: అను కపూర్, మాజీ డీన్ డా: రామ్మూర్తి, డా: జ్యోత్స్న రాణిలతో పాటు సొసైటీ అకడమిక్ డైరెక్టర్ దామోదర్ నాయుడు, సీఈఓ శిరందాస్ శ్రీనివాస్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ మహేష్ బసవేని, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం. ఏ వారీస్ పాల్గొన్నారు.

## రామాంజనేయ స్వామి ఆలయ హుండీ లెక్కింపు

**వెంగళరావునగర్:** వెంగళరావునగర్ ప్రధాన రహదారిపై దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ రామాంజనేయ స్వామి దేవాలయం హుండీని గురువారం లెక్కించారు. ఆదాయం మొత్తం రూ.95, 429లను భక్తులు సమర్పించారు. అనంతరం ఆలయ ఈఓ సత్యనారాయణ మాట్లాడుతూ... మూడు నెలల ఆదాయాన్ని లెక్కించామని పేర్కొన్నారు. ఎండోమెంట్ శాఖ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి, మరో ఈఓ కృష్ణ, దీక్షితులు (పూజారులు) అంబాస్వామి, వెంకటరత్నం, భక్తులు మధుకర్, లక్ష్మీపతి, సిబ్బంది పాల్గొన్నారు.

**ఎల్లారెడ్డిగూడ దుర్గామాత ఆలయం హుండీ లెక్కింపుపై వివాదం**

**శ్రీనగర్‌కాలనీ:** స్థానిక బస్తీ పెద్దలను సంప్రదించకుండా, దేవాలయానికి ఎటువంటి సంబంధం లేని వారిని పెట్టి ఎండోమెంట్ పరిధిలోని దేవాలయంలో హుండీని ఎలా లెక్కిస్తారని స్థానిక బస్తీ పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఎల్లారెడ్డిగూడ దుర్గామాత ఆలయంలో ఆలయ ఈఓ విఠల్ సమక్షంలో హుండీ లెక్కింపును చేపట్టారు. స్థానిక బస్తీ పెద్దలకు, బయట హుండీ లెక్కింపు అనే సమాచారం కూడా లేకుండా సంబంధం లేని వ్యక్తులతో ఎలా హుండీ లెక్కిస్తారని ప్రశ్నించారు. ఒక్క సీసీ కెమెరా కూడా లేకుండా దేవాలయం ఎలా ఉంటుందని, హుండీ ఆదాయం పక్కదారిన పడుతోందని ఆరోపించారు. వెంటనే సీసీ కెమెరాలు ఆలయ అభివృద్ధిని చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. బస్తీ నేతలు మనోజ్, చిన్న ముదిరాజ్, హరి, కిరణ్ యాదవ్ నవీన్‌యాదవ్, అశోక్ పాల్గొన్నారు.

## విద్యుత్ బిల్లు చెల్లించమన్నందుకు కార్మికుడిపై దాడి

**ఖైరతాబాద్:** విద్యుత్ బిల్లు ఇచ్చి బిల్లు చెల్లించాలని చెప్పిన విద్యుత్ ఆర్టిజన్ కార్మికుడిని చితకబాదిన సంఘటన ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... గురువారం ఖైరతాబాద్ ఓల్డ్‌సీఐబీ క్వార్టర్స్‌లో విద్యుత్ బిల్లులు ఇచ్చేందుకు విద్యుత్ ఆర్టిజన్ కార్మికుడు శ్రీనివాస్ ఓ ఇంటికి వెళ్లి బిల్లు ఇచ్చి ఎరియర్స్ ఉన్నాయి చెల్లించాలని కోరాడు. దీంతో కోపోద్రిక్తులైన పురుషోత్తం, భాస్కర్‌రావులు శ్రీనివాస్‌ను ముఖం, తలపై తీవ్రంగా కొట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు 341, 506, 333 ఐపీసీ రెడ్ విత్ 34 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### లాల్ బహదూర్ శాస్త్రికి ఘనంగా నివాళి

**లిబర్టీ:** మహనీయుల త్యాగాలను పోరాటాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని లోక్‌దళ్ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, జాతీయ కార్యదర్శి పుల్లూరి వెంకటరాజేశ్వరరావు కోరారు. మాజీ ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రీ దేశభక్తి ప్రజా సంక్షేమం కోసం జీవితాంతం కృషి చేశారని అన్నారు. లాల్ బహదూర్ శాస్త్రీ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. నేతలు పి.వి. శ్రీనివాస్, సంకీర్తన తదితరులు పాల్గొన్నారు.

### కేలండర్ ఆవిష్కరణ



**రహమత్‌నగర్:** సెంట్రింగ్ కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ హబీబ్‌ఫాతిమా నగర్ జోన్ అధ్యక్షుడు అహ్మద్ కోరారు. హెచ్ఎఫ్‌నగర్‌లో గురువారం అసోసియేషన్ రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. అసోసియేషన్ నాయకులు యాదగిరి, విఠల్, ముజీబ్, రమేశ్‌నాయక్, తుకారాం, రహీం, ఇబ్రహీం, ఫరూఖ్ తదితరులు పాల్గొన్నారు.

### నియామకం



**ప్రశాంత్‌కుమార్**

**బంజారాహిల్స్:** తెలంగాణ దళిత బహుజన సమితి గ్రేటర్ హైదరాబాద్ జనరల్ సెక్రటరీగా బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-10లోని ఉదయ్‌నగర్‌కు చెందిన గన్నారం ప్రశాంత్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు సమితి రాష్ట్ర అధ్యక్షుడు గజ్జెల్లి మల్లికార్జున మాదిగ నియామక పత్రాన్ని అందజేశారు. తెలంగాణలోని దళిత బహుజన సమితి సమగ్ర అభివృద్ధితో పాటు దళిత బహుజన జాతి సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతూ దళిత వర్గాలను సంఘటితం చేస్తూ తెలంగాణ రాష్ట్రంలో దళిత బహుజన ఉద్యమంలో ముఖ్య భూమిక పోషించాలని ఈ సందర్భంగా మల్లికార్జున మాదిగ సూచించారు. జాతి అభ్యున్నతికి అంకిత భావంతో పని చేస్తానని ప్రశాంత్‌కుమార్ తెలిపారు. తనకు ఈ పదవి వచ్చినందుకు మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పిడమర్తి రవికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధ చూపాలి: విజయారెడ్డి



**మెడికల్ కిట్స్ అందజేస్తున్న విజయారెడ్డి**

**ఖైరతాబాద్:** ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్య సంరక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ముఖ్యంగా విద్యార్థులు ఆరోగ్యంతో పాటు ఆట, పాటలతో ఫిజికల్‌గా ఫిట్‌గా ఉన్నప్పుడే అన్ని రంగాల్లో రాణించగలరని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ విజయారెడ్డి అన్నారు. కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్, బేగంపేట ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఎమర్జెన్సీ మెడికల్ కిట్స్ అందజేశారు. ఈ సందర్భంగా విజయారెడ్డి మాట్లాడుతూ... లక్ష్య సాధనలో అనుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు ఆరోగ్యం ఎంతో ముఖ్యమని, విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధ చూపాలన్నారు. ఏదేని సందర్భంలో విద్యార్థులు గాయపడినప్పుడు ఫస్ట్ ఎయిడ్‌గా మెడికల్ కిట్స్ ఉపయోగించుకోవచ్చన్నారు. రాజ్‌భవన్ హైస్కూల్, నిషుల్క్ ప్రభాత్, వాసవి అప్పర్ ప్రైమరీ, ఖైరతాబాద్ ప్రభుత్వ పాఠశాలకు మెడికల్ కిట్స్ అందజేశారు.

## పార్లమెంటు ఎన్నికల్లో పక్కా ప్రణాళికతో పని చేయండి

**అజహరుద్దీన్‌తో దీపాదాస్ మున్షి**



**దీపాదాస్ మున్షీతో అజహరుద్దీన్**




**మున్షీని సత్కరించిన దుశర్ల సుదర్శన్‌రావు**

**బంజారాహిల్స్:** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జీగా నియమితులైన దీపాదాస్ మున్షీతో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మహ్మద్ అజహరుద్దీన్ భేటీ గురువారం అయ్యారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని పలువురు మంత్రులతో పాటు అజహరుద్దీన్‌కు కూడా 25 మంది సభ్యులతో వేసిన ప్రత్యేక కమిటీలో స్థానం కల్పించారు. ఈ క్రమంలో మొన్నటి అసెంబ్లీ ఎన్నికలకంటే మెండుగా ఈ పార్లమెంటు ఎన్నికల్లో క్షేత్ర స్థాయిలో కార్యకర్తలు, నేతలు సమన్వయంతో పని చేసే విధంగా ప్రణాళికలు రూపొందించాలని అజహరుద్దీన్‌కు ఆమె సూచించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించాలని, రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అయ్యేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా కృషి చేయాలని ఆమె అన్నారు. ఈ సారి హైదరాబాద్‌తో పాటు సికింద్రాబాద్ పార్లమెంటు స్థానాన్ని ఎట్టి పరిస్థితిల్లో వదిలేది లేదని కచ్చితమైన ప్రణాళికలతో పని చేసి గెలిచి చూపిస్తామని అజహరుద్దీన్ అన్నారు. అదే విధంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కూడా త్వరలోనే డివిజన్ స్థాయి మహిళా, ఎస్సీ, ఎస్టీ, బీసీ కమిటీలు వేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలోకి చేరేందుకు ఎంతో మంది కీలక నేతలు ఆసక్తి చూపిస్తున్నారని తనకు ఫోన్లు చేస్తున్నారని దీప్‌దాస్ మున్షి దృష్టికి ఆయన తీసుకెళ్లారు.

**రేవంత్ నాయకత్వంలో ప్రగతిపథంలో తెలంగాణ: దుశర్ల సుదర్శన్‌రావు**

**బంజారాహిల్స్:** ఏఐసీసీ జనరల్ సెక్రటరీ, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని కాంగ్రెస్ సీనియర్ నేత, అధికార ప్రతినిధి దుశర్ల సుదర్శన్‌రావు గాంధీభవన్‌లో కలిసి ఘనంగా సత్కరించారు. రాష్ట్ర పర్యటనలో ఉన్న ఆమెను కలిసిన సుదర్శన్‌రావు.. ఆమె భర్త, కేంద్ర మాజీ మంత్రి దాస్‌మున్షీతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని ప్రజలు హర్షిస్తున్నారని, సంక్షేమం దిశగా రాష్ట్రం ముందుకు సాగుతోందన్నారు. రాబోయే కార్పొరేషన్ పదవుల్లో తమకు అవకాశం కల్పించాలని, ఈ మేరకు ఢిల్లీకి వచ్చి కలుస్తానని ఆమె దృష్టికి తీసుకువచ్చారు.

## డ్రైనేజీ పనులు ప్రారంభించాలని వినతి



**డీజీఎంకు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం**

**బంజారాహిల్స్:** సోమాజిగూడ డివిజన్ సుభాష్ నగర్‌లో డ్రైనేజీ, రోడ్డు నిర్మాణ పనులను సత్వరమే ప్రారంభించి పూర్తిచేయాలని సుభాష్ నగర్ అసోసియేషననేతలు జలమండలి డీజీఎం వాహబ్‌ను కోరారు. ఈ మేరకు వినతిపత్రాన్ని డీజీఎంకు సమర్పించారు. ఈ సందర్భంగా సుభాష్ నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు జి.దామోదర్ గౌడ్, కార్పొరేటర్ సంగీత యాదవ్ మాట్లాడుతూ... ఆయా పనుల కోసం ఏడాది క్రితం నిధులు మంజూరు చేశారని గుర్తుచేశారు. ఇందుకు సంబంధించి ఎమ్మెల్యే మంజూరు లెటర్ కూడా ఇచ్చారన్నారు. అయినా ఇంత వరకు పనులు ప్రారంభించలేదని డీజీఎం దృష్టికి తీసుకొచ్చారు. ఆయా పనులను సాధ్యమైనంత తొందరగా ప్రారంభించాలని వారు కోరారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి,
జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203